క్లుప్తంగా

సత్యనారాయణస్వామికి విశేష పూజలు


పూజలందుకున్న సత్యనారాయణస్వామి

పెందుర్తి: ఏకాదశి సందర్భంగా పెందుర్తి సాధుమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణ శర్మ, రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామి వాకి అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

జీవీఎంసీ దుకాణాలకు 9న వేలం

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్–8 పరిధి పెందుర్తి వాణిజ్య సముదాయంలో 2 దుకాణాలకు బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య సముదాయంలో గల ఆయా దుకాణాలను మూడేళ్ల కాల పరిమితికి వేలం ద్వారా ఇచ్చేందుకు ఈ నెల 9 ఉదయం 11 గంటలకు జోన్–8 కార్యాలయంలో నిర్వహించనున్న బహిరంగ వేలంలో ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జోనల్ కార్యాలయ పని వేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

పిల్లలను పాఠశాలకు పంపాలి


ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో, అధికారులు, విద్యార్థులు

పెందుర్తి: బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని మండల విద్యాశాఖాధికారి కె.సువర్ణ అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం దొగ్గవానిపాలెం కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. కె.గౌతమ్ అనే విద్యార్థిని పాఠశాలలో చేర్పించి కిట్ అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, హెచ్ఎం కె.మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: పద్మనాభపురం సబ్ స్టేషన్ బంటా కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. బంటాకాలనీ, మేహాద్రిగెడ్డ కాలనీ, అప్పలనర్సయ్య కాలనీ, వెంకటసాయినగర్, రవినగర్ ప్రాంతాల్లో ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

దూరవిద్యా పితామహుడు రాంరెడ్డికి నివాళి


రాంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు

ఎంవీపీకాలనీ: దూరవిద్యా పితామహుడు, ఇగ్నో వ్యవస్థాపక కులపతి ఆచార్య జి.రాంరెడ్డి ఇగ్నో అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఇగ్నో ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు అన్నారు. రాంరెడ్డి 29వ స్మారకోపన్యాస కార్యాక్రమాన్ని ఎంవీపీ కాలనీలోని కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని యువత అంతా చదువుకోవాలనే లక్ష్యంతో ఆచార్య రాంరెడ్డి దూరవిద్యా విధానాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలు ఏర్పాటు చేయడంలో ఆయన ప్రత్యేక భూమిక పోషించారన్నారు. అనంతరం రామరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రం ఉపసంచాలకుడు డాక్టర్ ఇ.కృష్ణారావు, పూర్వ సంచాలకుడు డాక్టర్ రాజారావు, విభాగాధికారి వీవీ పతిరావునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం

ఏసీపీ నరసింహమూర్తి


మాట్లాడుతున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

పెందుర్తి: యువత అనుకున్న లక్ష్యం చేరుకోవాలంటే కచ్చితంగా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు పాడు చేసుకుని తల్లిదండ్రులకు క్షోభ మిగిల్చినవారవుతారన్నారు. చినముషిడివాడలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం డ్రగ్స్ వినియోగం–దుష్ఫలితాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అలాగే ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో ఎంతో మంది నగదు కోల్పోయి ప్రాణాలు తీసుకునే పరిస్థితి వచ్చిందని చెప్పారు. యువత కష్టపడి పైకి రావాలే తప్పా అడ్డదారుల్లో ముందుకు వెళ్లాలనుకోవడం మంచి పరిణామం కాదన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పెందుర్తి సీఐ రామకృష్ణ, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ పండగ


ఘటాలను ఊరేగిస్తున్న లండ కుటుంబీకులు


అనుపు మహోత్సవంలో ఏర్పాటు చేసిన కేరళ డప్పు వాయిద్యాలు

సింహాచలం: అడవివరం గ్రామ దేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి బంగారమ్మతల్లి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తులు, భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పుసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చున్నారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. గ్రామ సంప్రదాయం ప్రకారం రాత్రి అమ్మవారి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాత అడవివరంలో ఉన్న బంగారమ్మ శతకంపట్టు నుంచి అమ్మవారి ఆలయం వరకు ఘటాలను పూజారి వంస్తులైన లండ కుటుంబీకులు గ్రామంలో ఊరేగించారు. దారిపొడవునా అమ్మవారికి గ్రామస్తులు స్వాగతం పలికి పసుపుకుంకుమలు సమర్పించారు. ఘటాలను శిరస్సుపై పెట్టుకుని మొక్కు తీర్చుకున్నారు. అనుపులో సింహాచలం దేవస్థానం ఏర్పాటు చేసిన కేరళ డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. కాగా నూతన ఆలయం నిర్మిస్తుండటంతో బాలాలయంలోనే భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

వేపాడమ్మ తల్లి ఆలయం ప్రారంభం


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పార్లుపాలెంలో కొలువుదీరిన వేపాడమ్మతల్లి ఆలయాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు న్యాయం చేయాలని వినతి


ఎస్పీ మురళీకృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న మత్స్యకార నాయకులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతంలోని ఉప్పుటేరులో మత్స్య సంపద మృత్యువాతకు కారణమైన ఫార్మా యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు, ఎంపీటీసీ సభ్యులు బొంది దేవిరవి, మైలపల్లి అప్పన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ముత్యాలమ్మపాలెంలోని ఉప్పుటేరు, తీర ప్రాంతంలో చేపల వేట సాగిస్తూ వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని వివరించారు. ఫార్మాసిటీలోని పరిశ్రమలు శుద్ధి చేయకుండా వ్యర్థ రసాయనాలు నేరుగా సముద్ర జలాల్లో విడిచిపెట్టడంతో మత్స్య సంపదకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. నష్టపోతున్న మత్స్యకారులకు ఫార్మా పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తామని 2012లో అప్పటి జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. మత్స్య సంపద మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యకార నాయకులు కోరారు. పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు ఉన్నారు.

అప్పన్నను దర్శించుకున్న రైల్వే జనరల్ మేనేజర్


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఈస్టు కోస్టు రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు అష్టోత్తరపూజ నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఏఈవో ఆనంద్ కుమార్ అందజేశారు. జీఎం వెంట వాల్తేరు డివిజన్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ఉన్నారు.

గొల్లగుంటలో తాగునీటికి కటకట


గొల్లగుంటలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకు


పాడైన బోరు, మోటారు పైపులైన్

పరవాడ: మండలంలోని రావాడ శివారు గొల్లగుంట గ్రామ ప్రజలు తాగునీటి కోసం కటకటలాడుతున్నారు. గ్రామంలో తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన బోరు మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీటి కోసం గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రెండు చేతి పంపులు ఉన్నా వాటి నుంచి సురక్షితమైన మంచినీరు రావడం లేదన్నారు. బోరుకు దూరంగా ఉన్న ఇళ్ల వారు మంచినీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

'ఉక్కు' రక్షణకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి


నారాయణకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణకు ఆ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. విశాఖలో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో పాల్గొనడానికి వచ్చిన నారాయణను కలిసి, ఇక్కడి పరిస్థితిని వివరించారు. ఇక్కడి స్టీల్‌ప్లాంట్ ఎందరో ప్రాణ త్యాగాలతో ఆవిర్భవించిందని, అలాంటి పరిశ్రమను ప్రైవేటీకరించేందుకు పూనుకోవడం సరికాదని వారు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే వేలాదిమంది రోడ్డున పెడతారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలంటూ ప్రస్తుత సమావేశాల్లో తీర్మానం చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, తాండ్ర కనకరాజు, జి.ఆనంద్, కె.రాజబాబు తదితరులున్నారు.

నయనానందకరం.. సురభి భూకైలాస్




భూకైలాస్ నాటకంలో సన్నివేశాలు


మద్దిలపాలెం : గత సురభి నాటకోత్సవాల్లో భాగంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం భూకైలాస్ నాటకం ప్రదర్శన అద్భుతంగా సాగింది. రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో బాదంగీర్ సాయి నేతృత్వంలో జరిగిన ఈ ప్రదర్శనను ఏయూ రంగస్థల విభాగం అధ్యాపకుడు డాక్టర్ మీగడ శశిభూషణస్వామి ప్రారంభించారు. శ్రీభానోదయ నాట్య మండలి(సురభి) హైదరాబాద్ బృందం సభ్యులు ఈ నాటకాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశాఖ రచయిత సంఘం కార్యదర్శి అడపా రామకృష్ణ, సహృది సాహితీ ప్రధాన కార్యదర్శి సిహెచ్.చిన్న, సూర్యనారాయణ, హస్య ప్రియ కామెడీ క్లబ్ కార్యదర్శి ఇమంది ఈశ్వరరావు, జ్యోతి సరళ నాటక పరిషత్ అధ్యక్షుడు అప్పలనాయుడు, సాయి కళా నికేతన్ గౌరవ అధ్యక్షుడు గంటా అప్పలనాయుడు, రంగస్థల నటి సంధ్యా, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


పిల్లి నాగరాజు

సబ్బవరం: మండలంలోని లింగాలతిరుగుడుకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యంపై సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది.లింగాల తిరుగుడుకు చెందిన పిల్లి నాగరాజు(35) అదృశ్యమైనట్టు ఎస్ఐ ధనుంజయ్ మంగళవారం తెలిపారు. గత నెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి నాగరాజు తిరిగి రాకపోవడంతో ఆయన భార్య కనకమహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

నూతన న్యాయ చట్టాలపై అవగాహన అవసరం


చట్టాలపై సచివాలయ పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటరావు

సీతమ్మధార : నూతన న్యాయ చట్టాలపై సచివాల య పోలీసులకు అవగాహన అవసరమని పోర్టుటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటరావు సూచించా రు. చట్టాలపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. జూలై 1 నుంచి మారిన సెక్షన్లు, బాధితుల హక్కుల పరిరక్షణకు తీసుకొచ్చిన కొత్త చట్టాలపై వివరించారు. మీ పరిధిలో ఎటువంటి నేరాలు జరిగినా వెంటనే పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని, ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే తక్షణమే సమాచారం అందించాలని కోరారు. సచివాలయ పరిధిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి అవగాహన కల్పించాలని సూచించారు. హెల్మెట్ ధరించని వారు, వాహనాలకు సంబంధించిన పత్రాలు లేనివారు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోర్టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 35 సచివాలయాల పోలీసులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. అప్పన్న నిత్య కల్యాణం


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

నేమ్ బోర్డు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


ఈవోఆర్డీ రమేష్‌నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెంలో ఏసీ కల్యాణ మండపం నేమ్‌బోర్డు ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ వెన్నల అప్పారావు కోరారు. ఈ మేరకు సర్పంచ్ అప్పారావు మంగళవారం ఈవోఆర్డీ రమేష్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఏసీ కల్యాణ మండపానికి పంచాయతీ బోర్డు సభ్యుల తీర్మానం మేరకు గతేడాది ఎన్టీపీసీ 'సింహాద్రి ఏసీ కల్యాణమండపం' అని నామకరణం చేయడం జరిగిందన్నారు. కాగా ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుర్తు తెలియని వ్యక్తులు నేమ్ బోర్డును ధ్వంసం చేశారన్నారు. అంతే కాకుండా పాత నేమ్ బోర్డు స్థానంలో దివంగత బండారు అప్పలనాయుడు పేరు మండపంపై రాయించి పంచాయతీ పాలకవర్గం నిర్ణయాలకు భంగం కలిగించారన్నారు. కల్యాణ మండపం నేమ్ బోర్డును ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అప్పారావు కోరారు. అధికారులను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పైల సత్యనారాయణ ఉన్నారు.

ఆర్వో ప్లాంట్ పునః ప్రారంభం


శుద్ధి జలాల పంపిణీని పునః ప్రారంభిస్తున్న అనకాపల్లి జెడ్సీ అయ్యప్పనాయుడు తదితరులు

పరవాడ: విశాఖ ఫార్మాసిటీ సహకారంతో తాడి గ్రామంలో పునఃప్రారంభించిన ఆర్వో ప్లాంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి జోనల్ కమిషనర్ వి.అయ్యప్పనాయుడు కోరారు. మరమ్మతుల అనంతరం ఆర్వో ప్లాంట్‌ను జెడ్సీ అయ్యప్పనాయుడు తిరిగి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాడి, చినతాడి, పెదతాడి ప్రజలకు తాగునీరు సరఫరా చేయడానికి రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు నిర్వహణ సమస్యల కారణంగా మూతపడిందన్నారు. విషయం తమ దృష్టికి రావడంతో సమస్యను రాంకీ ఫౌండేషన్ యాజమాన్యంతో చర్చించి మరమ్మతులు చేపట్టడడం జరిగిందన్నారు. ఆర్వో ప్లాంటు ద్వారా ప్రతీ ఇంటికి 20 లీటర్ల మంచినీరు చొప్పున సరఫరా చేయాలని నిర్ణయించామని చెప్పారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ పీవీ ముకుందరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మాధంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, ఫార్మా బల్క్ డ్రగ్ అసోసియేషన్ ప్రతినిధులు జె.సుబ్బారావు, రామేశ్వరరావు, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, రాజేశ్వరి పాల్గొన్నారు.

కమనీయం.. వెంకన్న కల్యాణం


ఆకట్టుకున్న అంబరిల్లా డ్యాన్స్


వెంకటేశ్వరస్వామి పల్లకి ఊరేగింపు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలో కొలువైన వేంకటేశ్వరస్వామి 18వ వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకం, అర్చన, ప్రత్యేక హారతులు, దూపదీప నైవేద్యాలతో పూజలు చేశారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ స్వామి వారి కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా తిరువీధి

కల్యాణ మహోత్సవంలో భాగంగా వెంకటేశ్వర స్వామి, పద్మావతిల తిరువీధి మహోత్సవం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సంప్రదాయ, సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపు కనుల పండుగగా సాగింది. వెంకటేశ్వర కాలనీ, నందగిరినగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాలలో స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. ఊరేగింపులో కోలాటం, తప్పెటగుళ్ళు, గొడుగుల డ్యాన్స్, కేరళ బ్యాండు, కోయ డ్యాన్స్, వెంకటేశ్వస్వామి వేషధారణ విశేషంగా ఆకట్టుకున్నాయి.

ప్రజా రక్షణే అగ్నిమాపక శాఖ ధ్యేయం


రక్షణ పరికరాలను అందిస్తున్న హిందుస్తాన్ కోలోస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి

మురళీనగర్: ప్రజల ప్రాణాల రక్షణ ధ్యేయంగా అగ్నిమాపక శాఖ పని చేస్తుందని ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఆర్.నిరంజన్‌రెడ్డి అన్నారు. బర్మా క్యాంపు కాలనీలోని మర్రిపాలెం అగ్నిమాపక కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రక్షణ సమయంలో సిబ్బంది స్వీయ రక్షణ కూడా అంతే ముఖ్యమని చెప్పారు. ప్రజలను విపత్తుల నుంచి రక్షించడంలో సిబ్బంది సేవలు విలువైనవని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది రక్షణ కోసం హిందుస్థాన్ కోలోస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.7లక్షలు విలువ చేసే రక్షణ సామగ్రిని అందించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కౌశిక్, ప్రతాప్, ఏవీఎస్ రావులను అగ్నిమాపక కేంద్రం తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి రేణుకయ్య, మర్రిపాలెం, సూర్యాబాగ్, పెదగంట్యాడ, చిట్టివలస అగ్నిమాపక అధికారులు కేవీటీ ప్రసాదరావు, పి.సింహాచలం, ఎం.గోపీకృష్ణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.